TELUGU NEWS TIMES

# తెలుగు న్యూస్ టైమ్స్

జాతీయ దిన పత్రిక




సంపుటి : 3 | సంచిక : 205 | గురువారం 14 నవంబరు 2024 | పేజీలు : 4 | వెల రూ. 3 | ఎడిటర్ : సిహెచ్. ముకుంద రావు | 9043514736, 9840467131 | online E-paper

## అనుమతులు రాగానే విశాఖ మెట్రో రైలు పనులు



**అమరావతి:** కేంద్రం నుంచి అనుమతులు రాగానే విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తామని మంత్రి నారాయణ తెలిపారు. రెండో రోజు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ప్రశ్నోత్తరాల్లో విశాఖ తెదేపా ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టుపై డీపీఆర్‌ను సిద్ధం చేశామని.. ఇప్పటికే దీన్ని కేంద్రానికి పంపినట్లు వెల్లడించారు. అక్కడి నుంచి అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామని వివరించారు.

మెట్రో రైలు ప్రాజెక్టును వైకాపా ప్రభుత్వం కక్షపూరితంగా పక్కన పెట్టేసిందని మంత్రి ఆరోపించారు. ఈ ప్రాజెక్టుపై స్వయంగా కేంద్ర మంత్రిని కలిసినట్లు వివరించారు. సీఎం చంద్రబాబుకూడా ప్రధాని మోదీకి లేఖ రాశారని చెప్పారు. విశాఖలో మొత్తం 76.90 కిలోమీటర్ల మేర మెట్రో నిర్మాణం చేపడతామన్నారు. రెండు ఫేజ్‌లలో 4 కారిడార్లలో నిర్మిస్తామని మంత్రి నారాయణ వివరించారు.

**మహిళా పోలీసు జాబ్ చార్ట్‌పై చర్చ** : సచివాలయాల్లోని మహిళా పోలీస్ జాబ్ చార్ట్‌పై అసెంబ్లీలో చర్చకు వచ్చింది. మహిళా పోలీసులకు పోలీసు శాఖతో సంబంధం ఉందా అని ఎమ్మెల్యే కూన రవి కుమార్ ప్రశ్నించారు. వారు పనిచేసేది ఎంపీడీవో పరిధిలో, కానీ సెలవు ఇవ్వాల్సింది లోకల్ సీఐ అని... ఆ గందరగోళాన్ని నివారించాలని కోరారు. సరైన శిక్షణ కూడా లేకుండా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళా పోలీసులను ఉమెన్ వెల్ఫేర్ శాఖలో కొనసాగించాలని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కోరారు. సభ సూచనలను తీసుకుని, పోలీసు శాఖతో చర్చించి మహిళా పోలీసుల కొత్త జాబ్ చార్ట్ ఇస్తామని హెూం మంత్రి అనిత వివరించారు.

## శాసన మండలిలో బొత్స, అచ్చెన్నాయుడి మధ్య వాగ్వాదం



**అమరావతి:** విజయనగరం జిల్లా గుర్లలో డయేరియా కేసులపై శాసన మండలిలో స్వల్ప వాగ్వాదం జరిగింది. బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందంటూ మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ చేసిన విమర్శలను మంత్రి అచ్చెన్నాయుడు తిప్పికొట్టారు. ప్రభుత్వం తరఫున ఇంకా పర్యవేక్షణ లోపం ఉందని బొత్స ఆరోపించారు. మృతుల విషయంలో స్పష్టత లేదన్నారు. అనంతరం అచ్చెన్నాయుడు స్పందిస్తూ గత ఐదేళ్లలో వాటర్ ట్యాంక్‌లలో పిడికెడు బ్లీచింగ్ కూడా వేసిన సందర్భాలు లేవన్నారు. పంచాయతీలకు పైసా నిధులు కేటాయించకపోగా.. కేంద్రం ఇచ్చిన వాటినీ దారిమళ్లించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.4వేలకోట్లతో పంచాయతీలను బలోపేతం చేసే చర్యలు చేపట్టిందన్నారు. గుర్ల ప్రాంతానికి ఇన్నాళ్లూ ప్రాతినిధ్యం వహిస్తున్నందున తన వల్ల కూడా ఇది జరిగిందని ఒప్పుకోవాలని బొత్సకు అచ్చెన్న హితవు పలికారు.




# అధికారుల జీతం నుంచి చెల్లించాల్సిందే..

### జడ్జిలా వ్యవహరించి స్థిరాస్తుల కూల్చివేత తగదు: బుల్డోజర్ న్యాయంపై సుప్రీం తీర్పు

**ఢిల్లీ : వివిధ కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల ఆస్తులను బుల్డోజర్లతో కూల్చివేయడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై బుధవారం సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. అధికారులు ఒక వ్యక్తి దోషి అని తేల్చి చెప్పలేరని, జడ్జిలా వ్యవహరించి నిందితుల స్థిరాస్తులను కూల్చివేయడం తగదని స్పష్టం చేసింది. రాష్ట్రాలు, ఆయా ప్రభుత్వాల అధికారులు మితిమీరి చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది.**

కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తే ధిక్కార చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ధర్మాసనం హెచ్చరించింది. కూల్చివేత ప్రక్రియలో నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలితే, ఆ ఆస్తి పునరుద్ధరణకు సంబంధించిన పరిహారాన్ని అధికారుల జీతం నుంచి వసూలు చేస్తామని కోర్టు స్పష్టం చేసింది.

"కార్యనిర్వాహక అధికారి ఒక వ్యక్తిని దోషిగా ప్రకటించలేరు. ఆ అధికారి న్యాయమూర్తిగా మారి, నిందితుల ఆస్తులను కూల్చివేయాలని నిర్ణయం తీసుకోలేరు. రాష్ట్రాల ఏకపక్ష చర్యల నుంచి పౌర హక్కులకు రాజ్యాంగం రక్షణ కల్పిస్తుంది. ఒక సామాన్య పౌరుడి ఇంటి నిర్మాణంలో అతడి ఎన్నో ఏళ్ల శ్రమ, కలలు కలగలిసి ఉంటాయి. దానిలో వారి భవిష్యత్తు, భద్రత ఇమిడి ఉంటుంది. ఆ ఇంట్లో ఒక్కరే నిందితుడు అయినప్పుడు.. అందులో నివసించే మిగతా వ్యక్తులకు ఆశ్రయం లేకుండా ఎలా చేస్తారు..? అలాగే అక్రమకట్టడాల తొలగింపు కోసం ఇంటి యజమానికి 15 రోజుల గడువు ఇవ్వాలి. అంతేగాకుండా మూడు నెలల్లో మున్సిపల్ అధికారులు ఒక డిజిటల్ పోర్టల్‌ను సిద్ధం చేయాలి. ఇప్పటివరకు ఇచ్చిన షోకాజ్ నోటీసులు, అక్రమ నిర్మాణాలపై తుది ఉత్తర్వులకు సంబంధించిన వివరాలు అందులో పొందుపరచాలి" అని జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది.

దేశవ్యాప్తంగా కొద్దికాలంగా 'బుల్డోజర్' చర్యలు హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. ఇది రాజకీయాల్లో కీలక అంశమైంది. బుల్డోజర్ న్యాయం పేరుతో పలు రాష్ట్రాలు ఈ అస్త్రాన్ని ప్రయోగిస్తున్నాయి. యూపీలో తొలుత మొదలైన ఈ ధోరణి.. ఆ తర్వాత ఇతర రాష్ట్రాలకూ పాకింది. దేశవ్యాప్తంగా ఇటీవల కాలంలో వివిధ రాష్ట్రాలు నిందితుల ఇళ్లు, ప్రైవేటు ఆస్తులపైకి బుల్డోజర్లను పంపించడాన్ని ఇప్పటికే పలు మార్లు సుప్రీం కోర్టు తప్పుబట్టింది. నిందితుల ఆస్తులపైకి బుల్డోజర్లను పంపించడం సరికాదని స్పష్టం చేస్తూ, అక్రమంగా ఒక్క కట్టడాన్ని ధ్వంసం చేసినా రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడినట్లేనని హెచ్చరించింది.

అయితే, రహదారులు, ఫుట్‌పాత్‌ల మీద, రైలు మార్గాలు, జలాశయాలు, ప్రభుత్వ స్థలాల పరిధిలో నిర్మించిన అక్రమ కట్టడాలకు తమ ఆదేశాలు వర్తించవంటూ మినహాయింపునిచ్చింది. కాగా ఈ విషయంపై సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ గతంలో కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ చర్యల ద్వారా పౌరుల గొంతు నొక్కడం సరైనది కాదని.. చట్టబద్ధమైన పాలన జరుగుతున్న సమాజంలో బుల్డోజర్ న్యాయం ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. ప్రజల నివాసాల రక్షణ, భద్రత వారి ప్రాథమిక హక్కుల కిందకు వస్తాయని.. వాటిని కూల్చివేసే అధికారం ప్రభుత్వాలకు ఉండదని ఆయన పేర్కొన్నారు. దీనికి అనుమతిచ్చిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలన్నారు.

## అసభ్యకర పోస్టులు.. వారిపై కేసులు పెడితే తప్పేంటి?: హైకోర్టు



**అమరావతి:** అసభ్యకర పోస్టులు పెట్టేవారిపై కేసులు పెడితే తప్పేముందని ఏపీ హైకోర్టు ప్రశ్నించింది. జడ్జిలను కూడా దూషిస్తూ పోస్టులు పెట్టారని వ్యాఖ్యానించింది. పోలీసుల చర్యలను నిలువరిస్తూ ఎలాంటి ఉత్తర్వులను ఇవ్వలేమంది. కేసులపై అభ్యంతరముంటే నేరుగా కోర్టును ఆశ్రయించాలని చెప్పింది. పిల్ వేయడానికి వీలు లేదని పేర్కొంది. సామాజిక మాధ్యమ కార్యకర్తలపై మూకుమ్మడిగా కేసులు పెడుతున్నారని విజయబాబు హైకోర్టులో పిల్ వేశారు.



# న్యాయవాదుల కుటుంబాలకు స్టాలిన్ ఆర్థిక సాయం



**విల్లివాకం న్యూస్:** తమిళనాడు న్యాయవాదుల సంక్షేమ నిధి నుంచి మరణించిన 10 మంది న్యాయ వాదుల కుటుంబాలకు రూ.కోటి ఆర్థిక సహాయాన్ని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ అందజేశారు. ఈ మేరకు ప్రభుత్వం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఇలా పేర్కొంది. తమిళనాడు లాయర్స్ వెల్ఫేర్ ఫండ్ మరణించిన న్యాయవాదుల వారసులకు ఆర్థిక సహాయం అందించడానికి స్థాపించబడింది. ఇది తమిళనాడు మరియు పుదుచ్చేరి లాయర్స్ అసోసియేషన్ ద్వారా నిర్వహించబడుతుంది. తమిళనాడు లాయర్స్ వెల్ఫేర్ ఫండ్ లబ్ధిదారులకు అందించే ఆర్థిక సహాయం రూ. 7 లక్షల నుండి రూ. 10 లక్షల వరకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ నేతృత్వంలోని ప్రభుత్వం అందజేస్తోంది. ఎం.కె. స్టాలిన్ బుధవారం చీఫ్ సెక్రటేరియట్‌లో న్యాయ వాదుల వారసులకు ఒక్కొక్కరికి 10 లక్షల రూపాయలు, మొత్తం ఒక కోటి రూపాయలకు చెక్కులు అందించారు. ఇందులో న్యాయశాఖ మంత్రి ఎస్.రఘుపతి, పార్లమెంట్ సభ్యుడు, సీనియర్ న్యాయవాది పి.విల్సన్, ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, ప్రొహిబిషన్ విభాగం అదనపు ముఖ్య కార్యదర్శి ధీరజ్‌కుమార్, న్యాయశాఖ కార్యదర్శి ఎస్. జార్జ్ అలెగ్జాండర్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.1000 డీఎంకే వైఫల్య భయానికి నిదర్శనం : రాందాస్



**విల్లివాకం న్యూస్:** విరుదునగర్ జిల్లా అరుప్పుక్కోట్టై కంచనాయకన్‌పట్టిలో గ్రామాభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో కె.కె.ఎస్.ఆర్. రామచంద్రన్ మాట్లాడారు. ఆ సమయంలో, దేవాదాయ శాఖ మంత్రి కెకెఎస్ఎస్ఆర్ రామచంద్రన్ జనవరి నుండి అన్ని కుటుంబ కార్డులకు మహిళల అర్హత మొత్తాన్ని ఇస్తామని స్పష్టంగా చెప్పారు. పీఎంకే వ్యవస్థాపకుడు రామదాస్ తన ఎక్స్ సైట్ పేజీలో ఒక పోస్ట్ లో ఇలా అన్నారు. మహిళల అర్హత మొత్తం రూ.1000 అనేది డీఎంకే వైఫల్య భయానికి నిదర్శనం అన్నారు.






# రాష్ట్రంలో శాంతి భద్రతలు విఫలం : విజయభాస్కర్



**విల్లివాకం న్యూస్:** చెన్నై ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ బాలాజీ జగన్నాథన్‌ను ఆసుపత్రి ఆవరణలోనే ఓ యువకుడు కత్తితో పొడిచాడు. కత్తిపోట్లకు గురైన డాక్టర్ బాలాజీ తీవ్ర గాయాలతో అదే ఆసుపత్రిలోని ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చికిత్స పొందుతున్నాడు. డాక్టర్‌ను కత్తితో పొడిచిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. డాక్టర్ బాలాజీకి అవసరమైన అన్ని చికిత్సలు అందించామని, సమగ్ర విచారణ జరిపామని ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ తెలిపారు. మరోవైపు ప్రభుత్వాసుపత్రిలో వైద్యుడిపై కత్తితో దాడి చేయడాన్ని ప్రతిపక్షాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. ఈ పరిస్థితిలో కత్తిపోటు ఘటనలో గాయపడి గిండి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న డాక్టర్ బాలాజీని ఏడీఎంకే మాజీ మంత్రులు విజయభాస్కర్, జయకుమార్, కడంబూర్ రాజు, జగన్నాథన్ స్వయంగా కలుసుకుని ఓదార్చారు. దీని తర్వాత ఎ.డి.ఎం.కె. మాజీ మంత్రులు సంయుక్తంగా మీడియాతో సమావేశమయ్యారు. ఆ సమయంలో మాట్లాడిన మాజీ మంత్రి విజయభాస్కర్, డీఎంకే. ప్రభుత్వంలో మహిళలు, పోలీసులు, వైద్యులపై దాడులు జరుగుతున్నాయని శాంతిభద్రతలు పరిరక్షించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

## 2026లో విజయ్ పార్టీతో పొత్తా!



**అన్నా నగర్ న్యూస్ :** కోయంబత్తూరులో అన్నాడీఎంకే విలేకరులకు ఇంటర్వ్యూ ఇచ్చింది. ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి మాట్లాడుతూ.. కోయంబత్తూరుకు ఎడిఎంకె హయాంలో తెచ్చిన ప్రాజెక్టులు, అతికడవు-అవినాసి సహా లెక్కలేనన్ని ప్రాజెక్టులు డీఎంకే చేపట్టాయి. ప్రభుత్వం ఇప్పుడు తెరదించింది. ఎ.డి.ఎం.కె. శంకుస్థాపన ప్రాజెక్టులన్నీ నత్తనడకన సాగుతున్నాయి. లెక్కలేనన్ని ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయి. అదేవిధంగా కోయంబత్తూరు విమానాశ్రయ విస్తరణ ప్రాజెక్టు కూడా పెండింగ్‌లో ఉంది. వెల్లలూరులో రూ.168 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన కొత్త బస్‌స్టేషన్‌ను 50% పూర్తి చేసినా, వాటిని నిలుపుదల చేశారు. డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలుకాని పథకాలన్నీ చెప్పి మేల్కొని నిలుస్తోందన్నారు.మరి 2026 అసెంబ్లీ ఎన్నికల్లో విజయ్ తమిళనాడు వెట్రి కజగం పార్టీతో పొత్తు ఉంటుందా? అని విలేకరులు ప్రశ్నించారు. దీనిపై ఎడప్పాడి పళనిస్వామి స్పందిస్తూ..ఎన్నికలకు ఇంకా ఏడాదిన్నర సమయం ఉందని ఎన్నికల సమయంలోనే చెప్పగలమని అన్నారు






# సభలో మంత్రి సత్యకుమార్ యాదవ్ తీరు సిగ్గు చేటు

**అమరావతి :** ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌పై వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి మండిపడ్డారు. శాసన మండలి చర్చలో 'డయేరియాపై సభ్యుల ఆవేదన చూసి ముచ్చట వేస్తోంది. 15ఏళ్లలో ఎప్పుడు లేని మరణాలు సంభవించాయి'అని చిరునవ్వుతో మంత్రి సత్యకుమార్ యాదవ్ వెకిలిగా మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. శాసన మండలి సమావేశాల సందర్భంగా డయేరియా మరణాలపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి మీడియాతో మాట్లాడారు. "సభలో డయేరియాపై ఆరోగ్యశాఖ మంత్రి సమాధానం బాధాకరం. మృతులపై ఎంతటి అభిమానం ఉందో మంత్రి నిర్లక్ష్య సమాధానమే చెబుతోంది.మంత్రి సత్యకుమార్ యాదవ్ వెకిలిగా మాట్లాడటం సిగ్గుచేటు. ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా వైఫల్యం చెందింది. గత 30 ఏళ్లలో గుర్లలో ఎన్నడూ డయేరియా మరణాలు సంభవించలేదు. సెప్టెంబర్ 20న మొదటి కేసు నమోదైంది. అక్టోబర్ 12వ తేదీ నాటికి 14 మంది ప్రాణాలు కోల్పోయారు. అక్టోబర్ 19న వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ట్వీట్ చేసే వరకు ప్రభుత్వంలో చలనం రాలేదు. 20 కిలోమీటర్ల దూరంలో ప్రభుత్వాసుపత్రి ఉంది. పక్క జిల్లాలో కేజీహెచ్ ఉంది. కానీ స్కూల్ బల్లలపై వైద్యం అందించారు. స్కూల్ బల్లలపై డయేరియా బాధితులకు వైద్యం అందించినందుకు ప్రభుత్వం సిగ్గు పడాలి. మృతుల సంఖ్యను తగ్గించడం పైనే ప్రభుత్వం దృష్టి పెట్టింది. డయేరియా నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే ఆలోచన కూడా చేయలేదు. ఒక్కో డయేరియా బాధిత కుటుంబానికి వైఎస్ జగన్ రూ.2లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు.




# విశ్వం కళాశాల ఘటన విచారకరం

- గేటు తీయక పోవడంతో దాడి సంఘటన
- 13 మందిపై కేసు నమోదు



**అన్నమయ్య జిల్లా న్యూస్ :** మదనపల్లె సమీపంలో అంగళ్ళు మార్గంలోని విశ్వం కళాశాలలో సెక్యూరిటీ ఇన్చార్జి శ్రీకాంత్ పై జరిగిన దాడిపై విభిన్న వాదనలు విన్పిస్తున్నాయి. ఈనెల 7న విశ్వం డిగ్రీ కళాశాల పంక్షన్ జరిగింది. దీనికి హాజరైన విద్యార్థులు సాయంత్రం ఇంటికి వెళ్లడానికి మెయిన్ గేటు వద్దకు వచ్చారు. అక్కడున్న సెక్యూరిటీ ఇన్చార్జి డిగ్రీ కళాశాల గేటు ద్వారా వెళ్లాలని సూచించారు. కళాశాల పంక్షన్ అయిపోయింది కదా బస్సులు కూడా ఇటు వైపు నుండే వెళతాయి..ఏ గేటు అయితే ఏమి వదలాలని విద్యార్థులు పట్టుపట్టారు. ఇంతలోనే గేటు తెరవద్దని సెక్యూరిటీ ఇన్చార్జి అక్కడే ఉన్న సిబ్బందికి సూచించారు. ఇది కాస్తా వివాదాస్పదంగా మారింది. అంతలో విద్యార్థులు అతనితో గేటు వద్ద గొడవపడ్డారు. దాడి జరిగే అవకాశం ఉందని భావించిన సెక్యూరిటీ ఇన్ ఛార్జి ఉన్నట్లుండి తన మోటార్ సైకిల్ వద్దకు వేగంగా పరుగు పెట్టాడు. అందులోని రాడ్ తీసుకున్నాడు. ఈ దృశ్యాలు సీసీ పుటేజీలో స్పష్టంగా కన్పిస్తున్నాయి. దీంతో విద్యార్థులు కూడా అతని వెంటపడ్డారు. మాపైనే రాడ్ తీస్తావా అంటూ మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. అదృష్ట వశాత్తు సెక్యూరిటీ ఇన్చార్జికి కూడా రక్త గాయాలు కాలేదు. ఈ సంఘటనంతా కూడా చకాచకా జరిగిపోయింది. 7న సాయంత్రం 4 గంటల 52 నిమిషాలకు ప్రారంభమై నిమిషం పాటు మాత్రమే ఈ సంఘటన జరిగినట్లు సీసీ పుటేజీలో రికార్డయి ఉంది. ఇది ఆలస్యంగా మంగళవారం వైరల్ అయ్యింది. దావానంలా వ్యాపించింది. కలకలాన్ని సృష్టించింది. కలవరాన్ని కలిగించింది. సెక్యూరిటీ ఇన్చార్జి శ్రీకాంత్ కళాశాల గేటు తెరచి ఉన్నా విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోయేవారు. లేదా విద్యార్థులు డిగ్రీ కళాశాల గేటు నుండి వెళ్లిపోయినా ఈ దాడి సంఘటన అస్సలు జరిగి ఉండేది కాదు. ఓపిక,సంయమనం లోపించడమే ప్రధాన కారణంగా చెప్పకతప్పదు. ఇంటికి వెళ్లేటప్పుడు ఏగేటు అయితే ఏమి వదిలేసి ఉంటే ఈ దాడికి ఆస్కారమే ఉండేది కాదు. ఇది కాస్తా సెక్యూరిటీ ఇన్చార్జిపై దాడికి దారి తీసింది. అతని ఉద్యోగం పోయింది. ఇంకో వైపు 13 మందిపై కేసు నమోదు అయ్యింది. ఇక్కడ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రఘునాథ రెడ్డికి మంచి పేరుంది. ఇతని ప్రమేయం లేకున్నా ఇతనితో పాటు పీఈటిపై కేసు కట్టడం విచిత్రంగా బావిస్తున్నారు. మరో వైపు జిల్లాలోనే మంచిగా పేరున్న ఈ కళాశాల ఇమేజ్ కొంత మేర నష్టం వాటిల్లింది. అందరి నోట నానింది. వివిధ కోణాల్లో ఆలోచిస్తే ఇది అందరికి నష్టాన్నే కల్గించింది. ఇది కేవళం నిమిషం పాటే జరిగినా ఇద్దరిలో ఎవరో ఒకరు ఓపిక పట్టి ఉంటే ఈ సంఘటనకు ఆస్కారమే ఉండేది కాదన్న వాదనలు విన్పిస్తున్నాయి. బ్యాడ్ టైమ్ అంటే ఇదేనేమో..!!

# జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీతో ఐఐటి మద్రాస్ ఒప్పందం



**విల్లివాకం న్యూస్:** ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాస్ (ఐఐటిఎం), ఒపి జిందాల్ గ్లోబల్ యూనివర్శిటీ (జెజియు) సామ్ విడ్ అభివృద్ధిపై సహకరించడానికి బుధవారం అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నాయి. హర్యానాలోని సోనిపట్‌లోని జెజియు క్యాంపస్‌లో కొత్తగా ఏర్పాటు చేయబడిన భారతదేశపు మొదటి రాజ్యాంగ మ్యూజియం కోసం రూపొందించబడిన వినూత్న సెమీ-హ్యూమనాయిడ్ గైడ్ రోబోట్ సామ్ విడ్. ఈ కార్యక్రమం ద్వారా భారత రాజ్యాంగం ఆమోదించబడిన 75 సంవత్సరాలను జరుపుకోవడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సందర్భంగా

జెజియు వ్యవస్థాపక వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సి రాజ్ కుమార్ మాట్లాడుతూ మద్రాస్ ఐఐటితో భాగస్వామ్యం ఆవిష్కరణ మరియు విద్య పట్ల మా అంకితభావాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. రాజ్యాంగ మ్యూజియం సాం విడ్ యొక్క విలీనంతో, పౌరులకు విజ్ఞాన ప్రాతిపదికగా ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా ఐఐటి మద్రాస్ ఇంజనీరింగ్ డిజైన్ విభాగం ఆర్బిజి ల్యాబ్స్ హెడ్ ప్రొఫెసర్ వెంకటేష్ బాలసుబ్రమణియన్ మాట్లాడుతూ మన గొప్ప చరిత్రకు ప్రాణం పోసే మానవరూప రోబోట్ అయిన సాంవిడ్ ద్వారా భారతదేశ రాజ్యాంగ చరిత్రకు సహకరించడం ఐఐటి మద్రాస్‌కు విశేషమని, రాజ్యాంగ మ్యూజియంలోని సందర్శకులకు లీనమయ్యే అనుభవాన్ని అందించగలమన్నారు. సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ సాంకేతికత ద్వారా రెండు ఇన్స్టిట్యూట్‌ల విద్యార్థుల మధ్య సహకారం జీవితంలోని అన్ని అంశాలలో అనుభవాలను సుసంపన్నం చేయడానికి మరియు ప్రజాస్వామ్య విలువలను అందించడంలో సహాయపడటానికి రూపొందించబడిందన్నారు.

# జనవరి నుంచి రేషన్ కార్డుదారులందరికీ రూ.1,000



**గిండి న్యూస్:** విరుదునగర్ జిల్లా అరుప్పుక్కోట్టై గంచనాయకన్‌పట్టిలో కెకెఎస్ఎస్ఆర్ఆర్ రామచంద్రన్ గ్రామీణాభివృద్ధి పనులను ప్రారంభించారు. ఆ సమయంలో మంత్రి కెకెఎస్ఎస్ఆర్ రామచంద్రన్ జనవరి నుంచి కుటుంబ కార్డులన్నింటికీ మహిళల హక్కు సొమ్ము అందజేస్తామని స్పష్టంగా చెప్పారు.ఆయన ఇంకా మాట్లాడుతూ.. వచ్చే జనవరి నుంచి రేషన్‌కార్డుదారులందరికీ మహిళా హక్కుల సొమ్ము రూ.1000 అందజేస్తామన్నారు.స్టైఫండ్ అందని ప్రతి రేషన్ కార్డుకు మహిళలకు ఉపకార వేతనం అందజేస్తారు.వృద్ధాప్య భృతి కోసం దరఖాస్తు చేసి ఆర్డర్ పొందిన వారందరికీ త్వరలో వృద్ధాప్య భృతి అందజేస్తామని తెలిపారు.

# పారామౌంట్ పిక్చర్స్ సమర్పణలో గ్లాడియేటర్ 2



**విల్లివాకం న్యూస్:** పారామౌంట్ పిక్చర్స్ సమర్పణలోదగ్లాడియేటర్ 2 చిత్రం రూపుదిద్దుకుంది. గ్లాడియేటర్ (2000) చిత్రం టైటిల్ రోల్‌లో రస్సెల్ క్రోవ్‌తో రిడ్లీ స్కాట్ చేసిన ఒక చారిత్రాత్మక ఇతిహాస చిత్రం. రోమన్ చక్రవర్తి అతని కుటుంబం మరణానికి ప్రతీకారం తీర్చుకోవడానికి గ్లాడియేటర్‌గా ద్రోహం చేసిన జనరల్ ఎదుగుదల గురించి ఇందులో చెప్పబడింది. ఈ చిత్రం 73వ అకాడమీ అవార్డ్సులో 5 అవార్డులను కైవసం చేసుకుంది. వాటిలో ఉత్తమ చిత్రం, నటుడు, కాస్ట్యూమ్ డిజైన్, విజువల్ అండ్ సౌండ్ ఎఫెక్ట్స్! కేటగిరీలు ఉన్నాయి. ఈ చిత్ర సారాంశం - 1వ భాగం లూసియస్ యొక్క సంఘటనలు జరిగిన రెండు దశాబ్దాల తర్వాత గ్లాడియేటర్ నుండి మాక్సిమస్ కుమారుడు వెరస్ (పాల్ మెస్కల్), (రస్సెల్ క్రోవ్, 2000), జనరల్ మార్కస్ అకాసియస్ (పెడ్రో పాస్కల్) నేతృత్వంలోని రోమన్ సైన్యం అతని భార్యను చంపిన తర్వాత గ్లాడియేటర్ అవుతాడు. దీంతో ఒక బానిస, లూసియస్ అకాసియస్‌పై ప్రతీకారం తీర్చుకుంటాడు. అంతేకాకుండా తన స్వంత ఎజెండాను కలిగి ఉన్న మాజీ బానిస మాక్రినస్ (డెనెల్ వాషింగ్టన్) మార్గదర్శకత్వంలో గ్లాడియేటర్‌గా పోరాడుతాడు. ఈ సినిమా ప్రీమియర్ ఆస్ట్రేలియాలోని సిడ్నీలో జరిగింది. చక్రవర్తి గ్రెటాగా జోసెఫ్ క్విన్, చక్రవర్తి కారా కల్లాగా ఫ్రెడ్ హెచింగర్, డెరెక్ జాకోబి, కొన్నీ నీల్సన్ తదితరులు ఉన్నారు. సినిమాటోగ్రఫీ- జాన్ మాథిసన్, సంగీతం - హ్యారీ గ్రెగ్సన్, విలియమ్స రిడ్లీ స్కాట్ దర్శకత్వం వహించారు. గ్లాడియేటర్ మొదటి భాగం ఆయనే దర్శకత్వం వహించారు. వయాకామ్ 18 స్టూడియో ద్వారా ఇంగ్లీష్, తమిళం, తెలుగు, హిందీలో విడుదల చేయబడింది.

# పట్టాలు తప్పిన గూడ్సు.. 39 రైళ్లు రద్దు చేసిన దక్షిణ మధ్య రైల్వే

**పెద్దపల్లి:** జిల్లాలో గూడ్సు రైలు పట్టాలు తప్పడంతో పలు రైళ్లు రద్దయ్యాయి. దక్షిణ మధ్య రైల్వే 39 రైళ్లు రద్దు చేయడంతో పాటు 7 రైళ్లను పాక్షికంగా రద్దు చేసింది. 53 రైళ్లను దారి మళ్లించారు.7 రైళ్లను రీ షెడ్యూల్ చేశారు. నర్సాపూర్-సికింద్రాబాద్, సికింద్రాబాద్-నాగ్‌పూర్, హైదరాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్, సికింద్రాబాద్-కాగజ్‌నగర్, కాజీపేట-సిర్పూర్ టౌన్, సిర్పూర్ టౌన్-కరీంనగర్, కరీంనగర్-బోధన్, సిర్పూర్ టౌన్-భద్రాచలం రోడ్, భద్రాచలం రోడ్-బల్లార్షా, బల్లార్షా-కాజీపేట, యశ్వంత్‌పూర్-ముజఫర్‌పూర్, కాచిగూడ-నాగర్‌సోల్, కాచిగూడ-కరీంనగర్, సికింద్రాబాద్-రామేశ్వరం, సికింద్రాబాద్-తిరుపతి, ఆదిలాబాద్-పర్లి, అకోలా-పూర్ణ, ఆదిలాబాద్-నాందేడ్, నిజామాబాద్-కాచిగూడ, గుంతకల్లు-బోధన్ రైళ్లను రద్దు చేశారు. పెద్దపల్లి-రామగుండం మధ్య రాఘవాపూర్ వద్ద మంగళవారం రాత్రి గూడ్సు రైలు బోల్తాపడింది. ఐరన్ కాయిల్స్‌తో వెళ్తున్న రైలు ఓవర్‌లోడ్‌లో 11 వ్యాగన్లు బోల్తా పడ్డాయి. వేగంగా వెళ్తున్న రైలు బోగీల మధ్య ఉన్న లింక్‌లు తెగిపోవడంతోపాటు ఒకదానిపై మరో బోగి పడి మూడు ట్రాక్‌లు దెబ్బతిన్నాయి. రాత్రి నుంచి ఘటనాస్థలిలో పునరుద్ధరణ చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటన కారణంగా ఢిల్లీ, చెన్నై మార్గంలో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాఘవపూర్ సమీపంలో యుద్ధ ప్రాతిపదికన రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి. ట్రాక్‌పై బోల్తాపడిన గూడ్స్ డబ్బాలను సిబ్బంది తొలగిస్తున్నారు. తెగిపడ్డ విద్యుత్తు తీగలను పునరుద్ధరిస్తున్నారు. కొత్త పట్టాలను ఘటనా స్థలికి తెప్పించి శరవేగంగా పట్టాలను అమర్చుతున్నారు. దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తున్నారు.

With best compliments from
Rtn, J.S.K. Naidu
Proprietor
9840066772



NATIONAL INDUSTRIAL SECURITY AGENCY
Specialized in security services
The best & Reliable Security Services for
Institutions
Industries
Commercial Offices
Apartments
Bungalows
Hospitals
Banks
Bouncer Ceremonial Functions & Events



JSK SECURITY SERVICES (P) LTD
Specialized in investigation of



Matrimonial
Thefts
Finger Prints
Pre & Pro Bio Data of Employees
Company records of Employees
No.28/24, 1st Main Road, Jai Nagar, Arumbakkam, Ch-106
Ph: 044-43531187 | Mobile: 98400 39394 | 98400 28888
E-Mail: nisaagency01@gmail.com
15

# డాక్టర్ పై దాడి కేసులో అరెస్టయిన విగ్నేష్ వాంగ్మూలం



**అన్నానగర్ న్యూస్:** తన తల్లికి సరైన వైద్యం చేయలేదని చెన్నైలోని గిండి కలైంజర్ సెంటినరీ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ బాలాజీని విఘ్నేష్ కత్తితో పొడిచిన ఘటన కలకలం రేపింది.ఈ ఘటనలో విఘ్నేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ఈ కేసులో డాక్టర్ బాలాజీపై దాడి చేసిన విఘ్నేష్ పోలీసులకు వాంగ్మూలం ఇచ్చాడు. ఆ వాంగ్మూలం లో,

తన తల్లికి సరిగ్గా చికిత్స చేయకపోవడంపై డాక్టర్‌ని అడిగాను. జనవరి నుంచి అమ్మ చికిత్స కోసం డాక్టర్ బాలాజీ వద్దకు వెళ్తున్నాను.మా అమ్మ కీమో ట్రీట్‌మెంట్ చేయించుకుంటున్నా ఆమె పరిస్థితి మెరుగుపడలేదు. చిక్విక్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లగా తల్లి పరిస్థితి మెరుగుపడింది. ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సకు ఒక్కొక్కసారి 20 వేలు. ఈ వైద్య ఖర్చులకు డబ్బులు ఇవ్వాలని డాక్టర్ బాలాజీని అడిగాను.అప్పుడు వాగ్వాదం జరిగింది. డాక్టర్ నన్ను మందలించి కిందకు తోసాడు. కోపంతో నేను దాచుకున్న కత్తిని తీసి పొడిచాను అని పేర్కొన్నాడు.


# రాష్ట్రంలో ప్రజలకు భద్రత లేదు : జయకుమార్



**గిండి న్యూస్:** తన తల్లికి సరైన వైద్యం చేయలేదని చెన్నైలోని గిడి కలైంజర్ సెంటినరీ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ బాలాజీని విఘ్నేష్ కత్తితో పొడిచిన ఘటన కలకలం రేపింది.ఈ ఘటనలో విఘ్నేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.ఈ కేసులో కత్తితో దాడికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డాక్టర్ బాలాజీని ఏఐఏడీఎంకే మాజీ మంత్రులు స్వయంగా కలిశారు.దీని ప్రకారం అన్నాడీఎంకే మాజీ మంత్రులు జయకుమార్, విజయభాస్కర్, కడంబూర్ రాజు తదితరులు గిండీ ఆస్పత్రిని సందర్శించారు.డాక్టర్‌ను కలిసిన తర్వాత ఏఐఏడీఎంకే మాజీ మంత్రులు విలేకరులతో సమావేశమయ్యారు.ఆ సమయంలో మాజీ మంత్రి జయకుమార్ మాట్లాడుతూ.. ప్రాణాలను కాపాడే వైద్యులకు రక్షణ లేని వాతావరణం నెలకొని ఉందని,మౌలిక సదుపాయాలు, శాంతిభద్రతల సమస్యల్లో ప్రభుత్వం విఫలమైందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితి రాకుండా చూడాలి. గాయపడిన డాక్టర్ బాలాజీని వ్యక్తిగతంగా కలుసుకుని సానుభూతి తెలియజేశామన్నారు.

# యురేనియం తవ్వకాలకు బ్రేక్

**కర్నూలు:** కర్నూలు జిల్లా దేవనకొండ మండలంలోని కప్పట్రాళ్ల అటవీ ప్రాంతంలో యురేనియం లభ్యత, పరిశోధనల కోసం బోర్లు వేసే ప్రతిపాదనను నిలిపివేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం ఆదేశాలిచ్చారు. ఈ తవ్వకాలను వ్యతిరేకిస్తూ కొద్దిరోజులుగా ఆందోళన చేస్తున్న సమీప గ్రామాల ప్రజలకు ఉపశమనం లభించినట్లైంది. 2023 జూన్‌లో వైకాపా ప్రభుత్వ హయాంలోనే బోర్ల తవ్వకాల కోసం స్టేజ్-1 అనుమతులు మంజూరయ్యాయి. కప్పట్రాళ్ల అటవీ ప్రాంతంలో యురేనియం ఉందా, లేదా అన్నది నిర్ధారించడానికి గత ప్రభుత్వ హయాంలోనే కొన్నిచోట్ల తవ్వకాలు జరిపారు. నమూనాలు పరీక్షించగా, యురేనియం నిక్షేపాలున్నట్లు తేలింది. మరింత లోతైన పరిశోధన కోసం అటవీ ప్రాంతంలోని 468.25 హెక్టార్లలో 68 బోర్ హోల్స్ వేసి మట్టి నమూనాలను తీసి విశ్లేషించాలని కేంద్ర ప్రభుత్వ 'ఆటమిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ రీసెర్చ్' (ఏఎండీ) నిర్ణయించింది. వారి తదుపరి కార్యాచరణను ఏఎండీ ఇటీవల విడుదల చేసింది. దీనిపై



స్థానికుల్లో నిరసన వ్యక్తమైంది.

**వైకాపా దుష్ప్రచారం :** ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వం ఇక్కడ తవ్వకాలకు అనుమతులు ఇవ్వకపోయినా, కొందరు వైకాపా నాయకులు తెదేపా ప్రభుత్వమే తవ్వకాలకు అనుమతులు ఇచ్చిందంటూ దుష్ప్రచారం చేశారు. ఈ విషయాన్ని మంత్రి టీజీ భరత్, పలువురు ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ముఖ్యమంత్రిని కలిసి వివరించారు. మంగళవారం మీడియా పాయింట్‌లోనూ మాట్లాడారు. స్పందించిన సీఎం.. కప్పట్రాళ్లలో భవిష్యత్తులోనూ యురేనియం తవ్వకాలకు అనుమతులు ఇవ్వకూడదని ప్రకటించారు.

# త్వరలో హిందీ సహా పలు భారతీయ భాషల్లో వైద్య విద్య

**లఖ్‌నవూ:** త్వరలోనే హిందీ సహా పలు భారతీయ భాషల్లో వైద్య విద్య అందుబాటులోకి వస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా లక్ష మెడికల్ సీట్లను జోడించామని.. రాబోయే ఐదేళ్లలో మరో 75 వేల మెడికల్ సీట్లు అందుబాటులోకి తీసుకొస్తామని వైద్య విద్యార్థులకు ప్రధాని హామీ ఇచ్చారు. దేశంలో 1.5 లక్షలకు పైగా ఉన్న 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు' బడుగు బలహీనవర్గాలకు మెరుగైన సేవలందిస్తున్నా యని తెలిపారు. దేశంలో దాదాపు నాలుగు కోట్ల మంది ప్రజలు దీని ద్వారా ప్రయోజనం పొందుతున్నారన్నారు. బిహార్ లోని దర్భంగా లో నిర్వహించిన సభలో ప్రధాని ప్రసంగించారు. దేశవ్యాప్తంగా ప్రజల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా దర్భంగాలో ఎయిమ్స్‌కు ప్రధాని శంకుస్థాపన చేసి, రూ.12,100 కోట్ల విలువైన ప్రాజెక్టులను ఆవిష్కరించారు. బిహార్‌లో నీతీశ్ కుమార్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను



ప్రధాని ఈ సందర్భంగా కొనియాడారు. ఆటవిక రాజ్యంగా ఉన్న రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారన్నారు. గత ప్రభుత్వాలు కేవలం తప్పుడు వాగ్దానాలు మాత్రమే చేశాయని.. కానీ రాష్ట్రంలో నీతీశ్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం పరిస్థితి మెరుగుపడిందని పేర్కొన్నారు. ముందు ముందు రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# గిండి ఆసుపత్రిలో వైద్యుల పోరాటం వాపసు

**అన్నానగర్ న్యూస్:** చెన్నైలోని గిండి కలైంజర్ సెంటినరీ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ బాలాజీని చికిత్స కోసం వచ్చిన మహిళ కుమారుడు కత్తితో దాడి చేసిన ఘటన చోటుచేసుకుంది. కత్తిపోట్లకు పాల్పడిన విఘ్నేష్‌ని అరెస్టు చేశారు. భారతదేశం అంతటా పని చేసే ప్రదేశంలో వైద్యులకు భద్రత కల్పించాలని కోలకతా ఆర్ జి కెర్ హాస్పిటల్ ఘటన తర్వాత వైద్యులు డిమాండ్ చేస్తున్నారు.ఈ స్థితిలో ఓ వైద్యుడిపై కత్తితో దాడి చేసిన ఘటన వైద్యుల్లో భయాందోళనకు గురి చేసింది. ఈ నేపథ్యంలో గిండి ప్రభుత్వాసుపత్రి వైద్యులు ఆస్పత్రి ఆవరణలో నిరసనకు దిగారు. అత్యవసర చికిత్స తప్ప మరే ఇతర చికిత్స అందించడానికి వారు నిరాకరించారు.అనంతరం ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్‌తో కలిసి ఆసుపత్రిని పరిశీలించిన మంత్రి ఎం.సుబ్రమణియన్ నిరసన తెలుపుతున్న వైద్యులతో చర్చలు జరిపారు. అయితే, వైద్యులు నిరాకరించారు.13 డిమాండ్లతో వైద్యులు నిరసన చేపట్టారు. ఈ క్రమంలో నిన్న సాయంత్రం 4 గంటల ప్రాంతంలో చెన్నై సచివాలయంలో ప్రభుత్వ వైద్యుల సంఘంతో



వైద్య, ప్రజా సంక్షేమ శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం చర్చలు జరిపారు. ఆ సమయంలో డిపార్ట్‌మెంట్ సెక్రటరీ సుప్రియా సాగు, మెట్రోపాలిటన్ పోలీస్ కమిషనర్ అరుణ్ తదితరులు కూడా చర్చలో పాల్గొన్నారు. అలాగే డాక్టర్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ ఈక్వాలిటీ, మెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్, గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ తదితరులు పాల్గొన్నారు.ఆసుపత్రుల్లో వైద్యుల భద్రతపై వైద్య సంఘాలతో సంప్రదింపులు జరుపుతున్నారు.ఈ సందర్భంలో, చర్చల తరువాత, చెన్నైలోని గిండి ఆసుపత్రిలో డాక్టర్ బాలాజీపై దాడిని ఖండిస్తూ వైద్యులు మరియు నర్సులు చేపట్టిన నిరసన విరమించబడింది.

# స్మార్ట్ మీటర్ల పేరుతో కూటమి మరో డ్రామా

**విజయవాడ:** ఏపీలో స్మార్ట్ మీటర్ల పేరుతో కూటమి ప్రభుత్వం మరో డ్రామాకు తెర లేపిందని వైయస్ఆర్‌సీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ మండిపడ్డారు. ఎన్నికల్లో సూపర్ సిక్స్ అంటూ ప్రచారం చేసి.. అధికారంలోకి వచ్చాక పథకాలను అమలు చేయడంలేదన్నారు. ఇది శంకుస్థాపనల ప్రభుత్వమే కానీ.. ప్రజలకు మంచి చేసే ప్రభుత్వం కాదంటూ తీవ్ర విమర్శలు చేశారు. బుధవారం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్ మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన ఏ హామీ అమలు కాలేదు. వైయస్ఆర్‌సీపీ హయాంలో కార్పొరేషన్లలో మంజూరైన పనులకు శంకుస్థాపనలు చేస్తూ కూటమి నేతలు కాలక్షేపం చేస్తున్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఆరు నెలల కాలంలో చేసిందేమీ లేదు. రోడ్లు, డ్రైనేజీ, ఇతర సమస్యలన్నీ అలాగే ఉన్నాయి. ఇది శంకుస్థాపనల ప్రభుత్వమే కానీ.. ప్రజలకు మంచి చేసే ప్రభుత్వం కాదు. వైయస్ఆర్‌సీపీ హయాంలో ప్రారంభించి చివరి దశలో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలి. లేనిపక్షంలో పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నాము. ఏపీలో కూటమి నేతలు స్మార్ట్ మీటర్ల పేరుతో మరో డ్రామాకు తెర లేపారు. గతంలో వైయస్ జగన్‌పై కూటమి నేతలు నిందలు వేశారు. దానికి ఇప్పుడు ఏ సమాధానం చెబుతారు. రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రచారం చేసుకుని అధికారంలోకి వచ్చారు. ఆ పథకాలు ఇప్పుడు ఎక్కడ ఉన్నాయి?. ఎన్నికల ముందు ఉదయం అవ్వగానే పథకాల గురించి ఫోన్లు చేసి వివరించారు. పథకాలు ఎవరెవరికి అందాయి ఇప్పుడు ఫోన్లు చేసి కనుక్కోండి. ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ ఏమైపోయాయి.

# సమ్మె బాటలో 108 ఉద్యోగులు

**విజయనగరం జిల్లా :** అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగుల ప్రాణాలు కాపాడే 108 ఉద్యోగులకు ఇప్పుడు పుట్టెడు కష్టాలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 108 ఉద్యోగులు తరచూ వేతనాలు సకాలంలో అందక నానా అవస్థలు పడుతున్నారు. కుటుంబ భారాన్ని మోయలేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవు తున్నారు. ఈ తరుణంలో తమ డిమాండ్లను నెర వేర్చాలని డిమాండ్ చేస్తూ 108 ఉద్యోగులు రోడ్డెక్క నున్నారు. నవంబర్ 25 నుంచి సమ్మె చేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉద్యోగులు సమ్మె నోటీసులు అందించారు.

